గురజాడ వీధి

# సౌందర్యారాధన





॥ అందం
ఆరాధించడానికేనా
కల్సి బతకడానికి
పనికి రాదా? ॥

చాగంటి నాగరాజారావు

"చూడు వినీలా! నీకు చేతనైతే ఫైల్సు రాయి, లేకపోతే ఫైల్సు తీసుకుని నాదగ్గర కొస్తే ఎలా రాయాలో చెప్తాను. అంతేకాని ఫైల్సు ఇలా ఆలస్యం చేస్తే ఊరుకోను. మనం పని చేస్తున్నది కోట్లతో వ్యాపారం చేస్తున్న షిప్పింగ్ ఏజన్సీలో. అంతేకాని చిల్లర దుకాణంలో కాదు" విసుక్కుని వినీలని పంపేశాడు కిరణ్.

అలా ఆమెను విసుక్కోడం అది మొదటిసారి కాదు. కిరణ్ ఆ షిప్పింగ్ ఏజన్సీలో ఎం.డి.గా చేరిన దగ్గర్నుంచీ అలా వినీలని విసుక్కుంటూనే ఉన్నాడు. వినీల రాత అందంగా ఉండకపోయినా చదవడానికి సులభంగానే ఉంటుంది. కాని ఆమె రాత తనకి అర్థం కావడంలేదని ఆమె రాసిన ఫైల్సుని ఆమెనే పిలిచి చదవమంటాడు కారణ్.

కొన్నాళ్ళపాటు వినీల సీట్లోంచి ఫైల్సేమీ రాలేదు. వెంటనే ఆమెని పిలిచాడు కిరణ్. భయంతో వణుకుతూ కిరణ్ గదిలోకి వచ్చింది వినీల.

"మూడు వినీలా ! లాయర్‌గారు కావాలన్న ఫైలు పంపడానికి పది రోజులు కావాలా?" సీరియస్‌గా అన్నాడు కిరణ్.

"అది నా సీటు కాదు సార్" అంది వినీల.

ఆ విషయం కిరణ్‌కి తెలుసు కాని కావాలనే వినీలని పిలిచాడు.

"ప్లర్లే అతన్ని పంపించు. చూడు! నీదగ్గర ఏవైనా పెండింగు ఫైల్సుంటే వెంటనే పంపించు" అన్నాడు కిరణ్.

"అలాగే సార్" అని తన గదిలోకి వెళ్లిపోయింది వినీల.

ఆ ఆఫీసులో పని చేస్తున్న స్త్రీలందరూ కిరణ్ దగ్గరకు వెళ్లి వినీల మంచితనం గురించి, పనితీరు గురించి చెప్పాలనుకున్నారు. కాని ధైర్యం చాలక ఆ ప్రయత్నం మానుకున్నారు.

అలా మూడు నెలలు గడిచాయి.

ఒక రోజు ఉదయం ఆఫీసులో అడుగుపెట్టి కుర్చీలో కూచోగానే తిరుపతి నుండి కిరణ్ మిత్రుడు శ్రీకాంత్ మరొకతనితో కలిసి వచ్చాడు.

"హాయ్!" ఆనందంతో కుర్చీలోంచి లేచి శ్రీకాంత్‌కి షేక్ హ్యాండిచ్చాడు కిరణ్. వాళ్లకి కుర్చీలు చూపిస్తూ తాను కుర్చీలో ఆశీనుడయ్యాడు.

కుశల పరామర్శలయ్యాక "ఏం తీసుకుంటావురా? కాఫీ, టీ, మిల్క్..." అడిగాడు కిరణ్.

"అవేమీ అక్ఖర్లేదు గానీ నేనో ముఖ్యమైన పని మీద వచ్చానురా. మీ ఆఫీసులో పని చేస్తున్న వినీల.." అని శ్రీకాంత్ చెప్పబోతుండగా కిరణ్ అడ్డుకున్నాడు.

"ఎవరు? ఆ అపురూప సౌందర్యరాశేనా? ఉందిరా. ఇక్కడే పనిచేస్తోంది. దాన్ని చూశావురా! లౌలీ గర్ల్.. చెంపకు చారెడేసి కళ్లు, అద్దాల వంటి చెక్కిళ్లు, దొండ పండు వంటి పెదవులు...అబ్బ ! దాన్ని చూస్తుంటేనే ఎంత ఆనందంగా వుంటుందో, ఇంకా దాన్ని పెళ్లిచేసుకుని దానితో సంసారం చేసేవాడు ఇంకెంత ఆనందిస్తాడోరా! వాట్ ఎ నైస్ గర్ల్..." శ్రీకాంత్ అడ్డుతగిలే వరకూ వర్ణించుకుంటూ పోయాడు కిరణ్.

"ఒరేయ్, ఒరేయ్! తప్పురా ఒక పెళ్లైన స్త్రీ గురించి అలా వర్ణించడం మర్యాద కాదురా" అన్నాడు శ్రీకాంత్

"పెళ్లైపోయింది కనకనే దాన్ని వర్ణిస్తూ కాలం గడుపుతున్నాను. దానికి పెళ్లి కాకుండా ఉంటే, వెంటనే ఉద్యోగం మానిపించి మూడు ముళ్లు వేసేసి నా స్వంతం చేసుకునే వాణ్ణి. కాని నా బ్యాడ్‌లక్! ఎం.డి.గా నేనిక్కడి కొచ్చేటప్పటికే దానికి పెళ్లైపోయింది" అన్నాడు కిరణ్.

"కాస్త మర్యాదగా మాట్లాడరా. ఒక పర స్త్రీని అది, ఇది అని సంబోధించడం తప్పురా" కాస్త సీరియస్‌గా అన్నాడు శ్రీకాంత్.

"ఏం చెయ్యమంటావురా దాన్ని అలానే పిలవాలనిపిస్తోంది. అది సరే కాని శ్రీకాంత్ ఈ అందమైన ఆడపిల్లలందరికీ అదేం జబ్బురా! ఇరవై ఏళ్లు నిండకుండానే పెళ్లిళ్లు చేసుకుని పిల్లల్ని కనేస్తారు. అనాకారులైతే పెళ్లికోసం కంగారు పడాలిగాని వినీల లాంటి అజంతా శిల్పాని కెందుకురా పెళ్లికోసం తొందర? అంత చక్కటి అందాల రాశి, అందులోనూ ఉద్యోగం చేస్తున్న ఆడది ఓ నిరుద్యోగిని పెళ్లి చేసుకునేంత ఖర్మేం కాలిందిరా! ఒక్క రెండేళ్లు ఓపిక పడితే నాలాంటి బిజినెస్ మేగ్నెట్‌కి భార్య అయ్యేది. అరవై లక్షల ఆస్తికి వారసురాలయ్యేది. ఏమిటో, దాని ఖర్మ, నా ఖర్మ" అన్నాడు కిరణ్.

"ఒరేయ్! నీకెన్నిసార్లు చెప్పాలిరా, పెళ్లైన స్త్రీ గురించి అలా మాట్లాడకూడదని!" సీరియస్‌గా అన్నాడు శ్రీకాంత్.

కాని కిరణ్ తన ధోరణిని మార్చుకోలేదు. ఇంకా వినీలని వర్ణిస్తూ పోయాడు.

"ఒరేయ్ శ్రీకాంత్! ఇప్పుడే వినీల ఇంత అందంగా వుంటే, ఇక తొలిరేయి ఎంత అందంగా వుండి వుంటుందిరా! బహుశా తొలిరేయి ఆమెను చూడగానే ఆమె భర్తకి పిచ్చెక్కి ఉద్యోగ ప్రయత్నాలు కూడా చెయ్యకుండా పెళ్లాన్ని గారాం చేస్తూ రోజులు గడిపేస్తూ వున్నాడు కాబోలు. ఏది ఏమైనా వినీల అందాన్ని వర్ణించాలంటే ఏ మహాకవులకోగాని సాధ్యం కాదురా. ఒరేయ్! అది నవ్వినప్పుడు చూశావురా, అందమైన పలువరుస బయటపడేలా బుగ్గన సొట్టలు పడుతూ ఎంత మధురంగా వుంటుందో! వినీల కార్యేషు దాసి, కరణేషు మంత్రి అవునో కాదోగాని, ఖచ్చితంగా రూపేచ లక్ష్మి, శయనేషు రంభేరా..." శ్రీకాంత్ అడ్డుతగిలేవరకు వర్ణించడం మానలేదు కిరణ్.

"ఒరేయ్! నువ్వు కాసేపు నోరుమూస్తే నేనొచ్చిన పనేమిటో చెప్తాను" సిగరెట్టు తీసి వెలిగిస్తూ అన్నాడు శ్రీకాంత్.

"చెప్పరా."

"నువ్వు వినీలకు అస్తమానూ తాకీదు లిస్తావుట. సస్పెండ్ చేస్తానని బెదిరిస్తుంటావట. ఎంత లేదన్నా జూనియర్ గుమాస్తా కదురా! అంత చిన్నపిల్లని అలా భయపెడితే పనెలా నేర్చుకుంటుందిరా?" సానుభూతిగా అన్నాడు శ్రీకాంత్.

ఒక్కసారి పగలబడి నవ్వాడు కిరణ్. అతనివైపు ఆశ్చర్యంగా చూశారు శ్రీకాంత్, అతని మిత్రుడు.

"ఒరేయ్! వినీల సౌందర్యాన్ని అనుక్షణం ఆరాధిస్తూ బతికేవాణ్ణి. ఆమెకి తాకీదులు, వార్నింగులు ఇచ్చానంటే నువ్వెలా నమ్మావురా? అవన్నీ ఉత్తుత్తి తాకీదులు, వార్నింగులే. నేనిచ్చిన వార్నింగులకు

గురజాడ వీధిలో
వచ్చేవారం
మధురాంతకం రాజారాం కథ
'మా బొంబాయి ప్రయాణం'

సూపర్ హీరోస్



శ్రీ టి. శేషాచలపతి
ప్రముఖహాస్యనటుడు ఏ.వి.ఎస్. దర్శకత్వంలో
శ్రీ డి. రామానాయుడు నిర్మించి[redacted]
విజయవంతంగా ప్రదర్శింపబడుచున్న
"సూపర్ హీరోస్" చిత్రంలో ఒక
ప్రత్యేక భూమికను పోషించిన
శ్రీ టి. శేషాచలపతి

ఆఫీసులో రికార్డు లేదురా" ఇద్దరూ ఆశ్చర్యపడేలా అన్నాడు కిరణ్.

"మరింక ఆ వార్నింగ్ లివ్వడంలో అర్థం?" కిరణ్‌వైపు ప్రశ్నార్థకంగా చూశాడు శ్రీకాంత్.

"చూడు శ్రీకాంత్! ఈ ఆఫీసులో సగం మంది స్త్రీలే. అందరూ అప్పలమ్మలూ, ముసలివాళ్ళే. వినీల ఒక్కత్తే అందగత్తె. అందరూ అప్పలమ్మలూ వాళ్ళ ఫైల్స్ వాళ్ళే స్వయంగా వచ్చి సంతకాలు పెట్టించుకుంటారు. వినీల కూడా అలాగే వస్తే రోజూ నాక్కాస్త కనువిందు కలిగేది. కాని వినీల తన ఫైల్సన్నీ జవానుకిచ్చి పంపిస్తుంది. అందుకే నా వార్నింగులకి భయపడి సంజాయిషీ ఇవ్వడానికి నా ముందుకొచ్చి నాక్కా సేపు కనువిందు చేస్తుందని అప్పడప్పుడు అలా భయపెడుతుంటాను" మళ్ళీ నవ్వాడు కిరణ్.

"బ్రతికించావురా. నువ్వు నిజంగానే ఆమెను భయపెడుతున్నావేమోనని కాస్త సానుభూతి చూపించమని అడగాలనొచ్చారీయన" తనతో వచ్చిన మిత్రుణ్ణి చూపిస్తూ అన్నాడు శ్రీకాంత్.

"ఎవ్వరా ఈయన?"

"వినీల భర్త"

"ఆ" అలా తెరుచుకున్న కిరణ్ నోరు మూత బడ్డానికి చాలా సేపు పట్టింది.

* * *

సాయంత్రం లాన్‌లో కూర్చుని ఆలోచిస్తున్నాడు కిరణ్. అతని మౌనాన్ని భంగం చేస్తూ లోపలికి వేగంగా స్కూటరొచ్చి ఆగింది. స్కూటర్ దిగి స్టాండ్ వేసి అతని ఎదుటి కుర్చీలో కూర్చున్నాడు శ్రీకాంత్.

"ఒరేయ్ కిరణ్! నీతో ఓ నిజం చెప్పాలనొచ్చా మురా. ఈ రోజు ఉదయం నాతో వచ్చిన వ్యక్తి వినీల భర్త కాదు. ఆమె బంధువు. ఆమె ఇష్టపడితే వినీలని పెళ్ళి చేసుకుంటావా?" అన్నాడు శ్రీకాంత్.

ఆ మాటలతో కిరణ్‌లో ఎక్కడలేని ఉత్సాహం పొంగింది.

"అంతకన్నా కోరుకునేదేముందిరా! మా పెళ్ళి జరిపించి పుణ్యం కట్టుకోరా" అవధులు దాటిన ఆనందంతో అన్నాడు కిరణ్.

"ఐతే నీకు మరో నిజం చెప్పాలిరా. ఏడాది క్రితం వినీల భర్త మరణించాడు. ఉద్యోగం చేసుకుంటూ తన ఏడాది కొడుకుని పోషించుకుంటూ బ్రతుకుతోంది వినీల. ఇప్పుడు చెప్పరా. నువ్వు వినీలని పెళ్ళి చేసుకుంటావా?" కిరణ్ కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అన్నాడు శ్రీకాంత్.

ఆ మాటతో అవాక్కయిపోయాడు కిరణ్.

వినీల అందం కిరణ్ ఆరాధనకే గాని ఆమెతో కలిసి బతకడానికి పనికిరాలేదు.

# పిల్లల సంరక్షణ

ఒక శిశువు మంచి వ్యక్తిత్వం గల పౌరుడుగా రూపుదిద్దుకోవడానికి శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడ ఎంతో ముఖ్యం.

అలా ఒక పిల్ల, పిల్లవాడు శారీరక, మానసిక ఆరోగ్యవంతుడుగా ఎదగడంలో తల్లిపాత్ర ఎంతో వుంటుంది.



మంచి వ్యక్తిత్వం కలవానిగా పెంచాలని విపరీతమైన క్రమశిక్షణ, కట్టుబాట్లతో ఆ పిల్లలను బంధించకూడదు.

పిల్లలకు చిన్న వాటిక్కూడ ఇవ్వవలసిన స్వేచ్ఛను ఇస్తూ పైనుంచి వారిని అనుక్షణం గమనిస్తూ వారు తప్పు చేస్తున్నారని అనిపించినప్పుడో, ప్రమాదంలో పడుతున్నారని తోచినప్పుడో తల్లులు రంగంలోకి దిగి వారు చేయబోయిన, చేసిన తప్పను సరిదిద్దాలి.

అన్నింటికన్న ముఖ్యమైనది వారిని ఆహ్లాదకరమైన ఆనందకరమైన వాతావరణంలో పెరగనివ్వడం.

తల్లిదండ్రులకు ఎన్నో టెన్షన్స్ వుండొచ్చు, కష్టాలు రావచ్చు. అయితే వాటన్నిటిని పిల్లలు పూర్తిగా అవగాహన చేసుకొని చిన్నప్పటి నుంచే 'ఎదగబతుకంతా చిందరవందర' అనేటటువంటి అభిప్రాయం వారికి ఏర్పడే విధంగా ప్రవర్తించకూడదు.

అలాఅని ఏమీ తెలియనీయకుండా చూస్తే లోకజ్ఞానం ఏమాత్రం లేకుండాపోయే ప్రమాదం వుంటుంది. ఏయే విషయాలు ఎంతవరకు తెలిస్తే మంచిదో అంతవరకే వారికి తెలియనిస్తూ పెంచడం ఎంతైనా అవసరం.

—సంస్కృతి


## ఆంధ్రజ్యోతి పాఠకులకు ఉచితంగా శ్రీ విష్ణు సహస్రం



వేల సంవత్సరాలుగా ఎందరో గానం చేస్తూ తరిస్తూ వచ్చిన శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్రమ్‌ను ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక పాఠకులకు ఉచితంగా అందిస్తున్నాం. ఆంధ్రజ్యోతి-రాజమండ్రి జ్ఞాన మహాయజ్ఞకేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో సమర్పిస్తున్న ఈ దివ్యగ్రంథాన్ని అందుకోవడానికి మీరు చేయవలసింది ఒక్కటే! మీ చిరునామాతో కూడిన కవర్ (రూపాయి స్టాంపు జతపరిచి) ఈ క్రింది చిరునామాకు పంపండి. కవర్‌పై స్పష్టంగా శ్రీ విష్ణు సహస్ర నామస్తోత్రమ్ కోసం అని రాయాలి.

మా చిరునామా

"శ్రీ విష్ణుసహస్ర నామ స్తోత్రమ్ కోసం"

సంపాదకుడు,

ఆంధ్రజ్యోతి వారపత్రిక,

బంజారా హిల్స్, రోడ్ నెం. 8,

హైదరాబాద్.

### కూపన్

పేరు ..............................................

చిరునామా ......................................

..............................................

..............................................

ఈ కూపన్ తప్పక జతపరిచిన వారికి మాత్రమే ఈ స్తోత్రమ్ అందుతుంది.